



సత్యసాయి 99వ జయంతి వేడుకల లోగోను ఆవిష్కరిస్తున్న ఆర్‌జే రత్నాకర్

వాడవాడలా వేడుకలు

- జిల్లాలో ఘనంగా ఆంగ్ల సంవత్సరాది... కేక్ కట్ చేసి సంబరాలు
- నేతలు, అధికారుల శుభాకాంక్షల వెల్లువ
- ప్రశాంతి నిలయంలో అలరించిన కార్యక్రమాలు
- సత్యసాయి 99వ జయంత్యుత్సవాల లోగో ఆవిష్కరణ



లేపాక్షిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కలెక్టర్ అరుణ్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న విదేశీ మహిళలు



జిల్లా పోలీసు కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

పుట్టపర్తి, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాది వేడుకలు జిల్లావ్యాప్తంగా వాడవాడలా సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు, రాజకీయ పార్టీల కార్యాలయాలు కిటకిటలాడాయి. పార్టీల నేతలు, ఉన్నతాధికారులు కేక్ కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. వారికి శుభాకాంక్షలు తెలిపేందుకు జనం క్యూకట్టారు. పుష్పగుచ్ఛాలు, మొక్కలతో ఉదయాన్నే కార్యాలయాలు, ఇళ్ల వద్ద క్యూకట్టారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అరుణ్‌బాబుకు జేసీ అభిషేక్ కుమార్, ఎస్పీ మాధవరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలుపారు. సత్యసాయిబాబా భక్తులు, విదేశీ మహిళలు సైతం శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. టీడీపీ కార్యాలయాల్లో పార్టీ ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలు కేక్ కట్ చేశారు. ప్రసిద్ధ లేపాక్షి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

ప్రశాంతి నిలయంలో అట్టహాసంగా వేడుకలు

పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో గల సాయికుల్వంత్‌లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సంగీత కళాశాల విద్యార్థులు బ్రాస్‌బ్యాండ్ వాయించారు. అనంతరం పంచ వాయిద్యాలతో విద్యార్థులు భక్తితాలు అలపించారు. సత్యసాయి 99వ జయంతి వేడుకల లోగోను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆవిష్కరించారు. దేశ, విదేశీ భక్తులతో సాయికుల్వంత్ కిటకిటలాడింది.



పుట్టపర్తిలో సాయి పల్లవి

పుట్టపర్తి, జనవరి 1: సినీ నటి సాయి పల్లవి సోమవారం పుట్టపర్తికి విచ్చేశారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని ఆమె దర్శించుకున్నారు.

పింఛన్ ఇస్తే అభ్యర్థే?

వైసీపీలో కొత్త ప్రచారం

హిందూపురం, జనవరి 1: వైసీపీలో టిక్కెట్ల పంపిణీ విషయంలో రోజుకో ట్విస్ట్. కొత్త కొత్త ప్రచారాలు వినిపిస్తున్నాయి. తాజాగా మరో ప్రచారం తెరపైకి వచ్చింది. అదేంటంటే ఈనెల 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీచేసేవారే ఆ నియోజకవర్గానికి అభ్యర్థిగా ఉంటానంటూ ఆ పార్టీలో పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. ఈనెల ప్రభుత్వం పెంచిన మొత్తంతో కలిపి రూ.3వేలు పింఛన్ అందజేయనున్నారు. ఇది ఎన్నికలకు ముందు ఆ పార్టీ పెద్ద ప్రచారం చేసుకోవాలని తలపెట్టింది. ఇందులో భాగంగానే లబ్ధిదారుల ఇళ్లకెళ్లి వారితో కలిసి పింఛన్ అందజేయాలని అదిష్టానం నుంచి సూచనప్రాయంగా ఆదేశాలు అందినట్లు సమాచారం. ప్రస్తుతం నియోజకవర్గాల్లో నెలకొన్న టిక్కెట్టు ప్రతిష్టంబనకు పింఛన్‌ను ముడిపెట్టారు. ప్రస్తుతం నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలను మార్చుతున్నారు. మార్చిన నియోజకవర్గాల్లో కొత్త పింఛన్లు అందజేస్తే వారే ఇక వైసీపీ తరఫున ఎన్నికల బరిలో ఉంటారని అదిష్టానం.. నాయకులకు ఆదేశించినట్లు తెలిసింది. ఈ తరుణంలోనే 3వ తేదీ కోసం ఆ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో మార్పులు చేర్పులు పూర్తయి మంగళవారం నియోజకవర్గాల బాధ్యులను నియమించనున్నట్లు ఆ పార్టీలో ప్రచారం మొదలైంది. దీంతో ఇందుకోసం పింఛన్ల పంపిణీ ఆలస్యమైందన్న వాదన కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జిలుగా ఎవరిని నియమిస్తారు, పింఛన్లు ఎవరు పంపిణీ చేస్తారన్న దానిపై ఆ పార్టీలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

పట్టు వీడం.. పోరు ఆపం..



హిందూపురం మునిసిపల్ కార్యాలయం ముందు తెల్లవారుజామునే బైఠాయించి, నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు



కదిరిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

- కొత్త ఏడాదిలోనూ అదే జోరు
- అందరిదీ ఆందోళన బాట
- సమ్మెతో స్తంభించిన పాలన


పుట్టపర్తి, జనవరి1(ఆంధ్రజ్యోతి): 'అధికారంలోకి వస్తే మీ సమస్యలు పరిష్కారిస్తా, నాకు పట్టం కట్టండి' అంటూ ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగులకు అనేక హామీలు గుప్పించారు. తీరా ముఖ్యమంత్రి అయ్యాక వాటన్నిటినీ విస్మరించారు. ఈనేపథ్యంలో ఉద్యోగులు పోరుబాట పట్టారు. ఏ ప్రభుత్వంలోనూ ఇంతస్థాయిలో సమ్మెలు చేయలేదు. వైసీపీ ప్రభుత్వం తీరుపై నిరసనగా ఒక్కొక్కరుగా సమ్మెకు దిగడంతో పాలన ప్రశ్నార్థకంగా మారిందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇచ్చిన హామీలను సీఎం జగన్ నిలబెట్టుకోవాలని కోరుతూ సమ్మెకు దిగితే ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని విమర్శలు మూటగట్టుకుంటోంది. సమ్మె చేపట్టిన అంగన్‌వాడీలు, సమగ్రశిక్ష ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులను బెదిరిస్తోంది. ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె జిల్లాలో 20వ రోజూ ఉధృతంగా కొనసాగింది. కొత్త సంవత్సర ప్రారంభం రోజూ వివిధ రూపాల్లో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిరసన ప్రదర్శనలతో హోరెత్తించారు. 20 రోజులుగా నిరసన తెలుపుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం దిగొచ్చి వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల సమ్మెతో కేంద్రాలు వెలవెలబోతున్నాయి. నిత్యం చిన్నారులు, లబ్ధిదారులతో కళకళలాడే కేంద్రాలు 20 రోజులుగా దయనీయంగా మారాయి. తమ సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె విరమించేది లేదని సమగ్రశిక్ష ఉద్యోగులు 13 రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. దీంతో విద్యాశాఖలో పనులన్నీ నిలిచిపోయాయి. నగర, పురపాలక సంస్థల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల పారిశుధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె కొనసాగిస్తున్నారు. పర్మినెంట్ కార్మికుల కంటే ఎక్కువ వీరే మున్సిపల్ వ్యవస్థను నడిపిస్తున్నారు. వీరి సమ్మెతో పట్టణాలు, పల్లెల్లో నగర, పురపాలికల్లో చెత్తమయంగా మారి, తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. సమ్మె కొనసాగితే ప్రజలు రోగాల బారినపడే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సీఎం జగన్ తమ సమస్యల గురించి పట్టించుకోవడం లేదని న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేదాకా సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు.

- హిందూపురంలోని ధర్మపురంలో ప్రైవేటు కార్మికులు పారిశుధ్య పనులు చేస్తుండగా తెల్లవారుజామునే పారిశుధ్య కార్మికులు అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. తాము సమ్మెలో ఉంటే.. ఎలా పనులు చేస్తారని నిలదీశారు. ప్రైవేటు ట్రాక్టర్లను మునిసిపల్ కార్యాలయానికి తరలించి, తాళాలు వేశారు. మునిసిపల్ కార్యాలయం వద్ద కొంతసేపు బైఠాయించి, నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయం ముందు సమ్మెలో పాల్గొన్నారు

పురం కోసం పెద్దల ఫైట్..!

- వైసీపీ అధిష్టానంలో చీలికలు
- ఒకరికి పెద్దాయన అండ
- మరో నేత కోసం ముగ్గురు పెద్దల పట్టు
- తాడేపల్లికి మరో ప్రజాప్రతినిధి

హిందూపురం



వైసీపీ హిందూపురం నియోజకవర్గ అభ్యర్థి ఎంపిక విషయంలో స్థానికంగానే కాదు, రాష్ట్రస్థాయిలో సైతం చీలికలు ఏర్పడ్డాయి. పార్టీ అధిష్టానంలో కీలకంగా ఉన్న నేతలు చీలిపోయి ఇద్దరు నేతలకు మద్దతుగా నిలుస్తున్నారని తెలిసింది. పురంలో నాలుగు వర్గాలుగా టిక్కెట్టు కోసం పోటీ పడుతుండగా.. ఇద్దరు నేతల కోసం నలుగురు పెద్దలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆ పార్టీలో చర్చ సాగుతోంది. గతంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఇక్బాల్‌ని సాగనంపి, దీపికను సమన్వయకర్తగా తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన పక్క జిల్లాకు చెందిన మంత్రి, పార్టీలో కీలకంగా ఉన్న పెద్దాయన.. ఆమెకే ఎలాగైనా టిక్కెట్టు ఇప్పించాలని నానా తంటాలు పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గంలోని మరో సీనియర్ నేతకు అధికార పార్టీలోని ముగ్గురు రాష్ట్రస్థాయి నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మొన్నటి వరకు తనకే టిక్కెట్టు ఇవ్వాలని అభ్యర్థిస్తున్న నేత ఒకవేళ మహిళకే అవకాశం ఇవ్వాలనుకుంటే తన సతీమణికి ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు తెలిసింది. దీంతో హిందూపురం వైసీపీ టిక్కెట్టు విషయంలో రాష్ట్రస్థాయిలో కీలక నేతలు పడుతున్న సిగపట్లు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. దీనిపై ఇంకా ఎంత రచ్చ జరుగుతుందోనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఒకరికి పెద్దాయన అండ

ప్రస్తుత సమన్వయకర్తకు పెద్దాయన అండ పుష్కలంగా ఉందన్నది బహిరంగ రహస్యం. సమన్వయకర్తను ఇక్కడికి రప్పించడానికి తీవ్రంగా కృషిచేసిన నియోజకవర్గంలోని కొంతమంది ముఖ్య నాయకులే వారు వద్దు బాబు అంటూ పెద్దాయన వద్ద మొరపెట్టుకున్నారు. అయినా.. అవన్నీ కుదరవనీ, కలిసి పనిచేయాల్సిందేనంటూ స్థానిక నాయకులకు ఆదేశాలిచ్చారు. ఇటీవల ఆయనను కలిసిన ముఖ్యనేతలు టిక్కెట్టు విషయంలో మరోసారి ఆలోచించాలనీ, ఏ సర్వేలోనూ అనుకూలంగా రాలేదని నాయకులు చెప్పినా పెద్దాయన పట్టించుకోలేదని తెలిసింది. దీంతో నాయకులు కొంత అసహనానికి లోనై, వెనుదిరిగి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుత సమన్వయకర్తను ఇక్కడికి వచ్చి నాలుగు నెలలు అవుతుండటంతో వెంటనే మార్పు చేస్తే పార్టీ పరువు పోతుందేమోనన్న ఆలోచనలో పెద్దాయన ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఎలాగైనా వారినే కొనసాగించి గెలుపునకు కృషి చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. పెద్దాయన సొంత నియోజకవర్గంపై కూడా పెట్టని దృష్టి హిందూపురంపై పెట్టారన్న వాదనలు వినిపిస్తున్నాయి. తన ముఖ్య అనుచర గణాన్ని హిందూపురానికి పంపి, పరిస్థితి చక్కదిద్దాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం సైతం పెద్దాయన అనుచరులు హిందూపురం వచ్చి, నాయకులతో సమావేశమై గెలుపునకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.



తాడేపల్లికి ఓ ప్రజాప్రతినిధి

ఇప్పటి వరకు హిందూపురం టిక్కెట్టు విషయంలో స్థానిక నాయకులే వర్గాలుగా విడిపోయి డిమాండ్ చేస్తున్నారు. తాజాగా జిల్లా స్థాయి ప్రజాప్రతినిధి తనకు ఇవ్వాలని కోరేందుకు తాడేపల్లికి వెళ్లినట్లు సమాచారం. ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాన్ని ఈసారి కేటాయించకపోవడంతో హిందూపురం అసెంబ్లీ స్థానమైనా ఇప్పించాలని కోరేందుకు వెళ్లినట్లు ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా హిందూపురం టిక్కెట్టు విషయంలో స్థానికంగానే కాకుండా రాష్ట్రస్థాయిలో లుకలుకలు ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. జగన్ వద్ద ఎవరి మాట గెలుస్తుందో చూడాల్సిందే.

మరో నేత కోసం రంగలోకి ముగ్గురు..

పార్టీలో సీనియర్ నేతకు రాష్ట్రస్థాయిలో ముగ్గురు పెద్దల అశీర్వాదం ఉన్నట్లు సమాచారం. ఈ ముగ్గురిలో అన్నీ తానై వ్యవహరించే ఒక నేతతోపాటు మరో రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధి కాగా, మరో వ్యక్తి సదరు హిందూపురం నేత సామాజికవర్గానికి చెందిన ఉద్యమకారుడు కావడం విశేషం. రాయలసీమలో కాపు సామాజికవర్గానికి అవకాశం కల్పించలేదు. ఈ నేపథ్యంలో పురం నేతకు గానీ, లేదంటే మహిళ అనుకుంటే ఆయన సతీమణికిగానీ ఇవ్వాల్సిందిగా అధినేత వద్ద గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. సదరు నేత నాలుగు రోజులుగా విజయవాడలోనే మకాం వేసినట్లు తెలిసింది. ఇటీవల ఆ పార్టీ తరఫున చేపట్టే సర్వే బృందం సదరు నేత సతీమణి పేరును చేర్చి సర్వే చేసినట్లు తెలిసింది. ఇందులో రాష్ట్రస్థాయి నేత హస్తంపై హిందూపురంలో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎవరు పైచేయి సాధిస్తారో వేచిచూడాల్సిందే.

రాజుకుంటున్న అసమ్మతి..!

కదిరి వైసీపీలో రాజీనామాల పర్వం

- అధిష్టానంపై ఆగ్రహంగా సిద్దారెడ్డి వర్గీయులు
- ఉత్తుత్తి రాజీనామాలే అంటున్న మరో వర్గం



రాజీనామా పత్రాలను కదిరి మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు (ఫైల్)

కదిరి

వైసీపీ కదిరి నియోజకవర్గ అభ్యర్థి మార్పు ఊహాగానాల నేపథ్యంలో అసమ్మతి రాజుకుంటోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డికి టిక్కెట్టు ఇవ్వరన్న కథనాల నేపథ్యంలో పార్టీ అధిష్టానంపై ఆయన వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. నియోజవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు రాజీనామా బాటపట్టారు. దీంతో వైసీపీలో అసమ్మతి రాజుకుంది. పార్టీలో రెండు వర్గాలుగా విడిపోయారు. సిద్దారెడ్డి వర్గీయులు చేస్తున్న రాజీనామాలు ఉత్తుత్తివేనని మరో వర్గంవారు సోషల్ మీడియాలో ఎద్దేవా చేస్తున్నారు. కదిరి టిక్కెట్టును మైనారిటీ వర్గానికి కేటాయిస్తారన్న ప్రచారం నేపథ్యంలో సిద్దారెడ్డి వర్గీయులు ఆగ్రహంగా ఉన్నారు.

కొనసాగుతున్న రాజీనామాల పర్వం

ఎమ్మెల్యే సిద్దారెడ్డికి వచ్చే ఎన్నికల్లో కదిరి వైసీపీ టిక్కెట్టు కేటాయించరన్న ఊహాగానాల నేపథ్యంలో ఆయన వర్గీయులు రాజీనామాలు చేస్తున్నారు. ఆరు మండలాల్లో ఇప్పటికే ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రాజీనామా చేశారు. కదిరి మున్సిపాలిటీలో 14 మంది కౌన్సిలర్లు అదేబాట పట్టారు. రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్‌కు శనివారం అందజేశారు. శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జెరిపిటి గోపాలక్రిష్ణతో పాటు పాలక మండలి సభ్యులు సైతం రాజీనామా చేశారు. సిద్దారెడ్డికి టిక్కెట్టు కేటాయించకపోతే తాము పార్టీ సభ్యత్వాలకు కూడా రాజీనామా చేస్తామని చెబుతున్నారు. అధిష్టానం కనీసం నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయం తీసుకోలేదని చెబుతున్నారు. ఏనాడూ పార్టీ జెండా మోయని వారిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తున్నారు. సామాజిక సమీకరణాల ప్రకారం మైనారిటీకి టిక్కెట్టు కేటాయించాలంటే పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న సీనియర్ నాయకులను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. కదిరి ప్రజలకు ముఖ పరిచయం కూడాలేని వ్యక్తులకు టిక్కెట్టు ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కష్టపడిన వారికి మొండిచెయ్యేనా..?

వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్న వారికి అధిష్టానం మొండిచెయ్యి చూపిందంటూ వైసీపీ కార్యకర్తలు మండిపడుతున్నారు. పార్టీలో సీనియర్లను కాదని కనీసం పార్టీ నాయకులు గాని, కార్యకర్తలకు గాని ఏమ్రాతం పరిచయం లేని వ్యక్తికి టిక్కెట్టు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. డబ్బుంటే చాలు.. టిక్కెట్టు ఇస్తారా అంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.



ఉత్తుత్తి రాజీనామాలంటూ ఎద్దేవా

ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలంటే సంబంధిత అధికారులకు పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు భిన్నంగా నియోజకవర్గంలో రాజీనామాలు కొనసాగుతున్నట్లు అసమ్మతి వర్గం వారు సోషల్ మీడియాలో ఎద్దేవా చేస్తున్నారు. సర్పంచ్ రాజీనామా చేయాలంటే స్థానిక అర్డీఓకిగానీ, డీపీఓకిగానీ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీలో కౌన్సిలర్లు రాజీనామా చేయాలంటే కమిషనర్‌కు సమర్పించాలి. నియోజకవర్గ వ్యాప్తంగా రాజీనామాలు చేసిన ప్రజాప్రతినిధులు ఆయా మండలాల్లో ఎంపీడీఓలకు అందుకు సంబంధించిన పత్రాలను అందిస్తున్నారు. ఎంపీపీలు, ఎంపీటీసీలు డీపీఓకు అందజేయాల్సి ఉంటుంది. అలా ఎవ్వరూ చేయలేదు. ఈ నేపథ్యంలో ఇవి ఉత్తుత్తి రాజీనామాలేనని ఎద్దేవా చేస్తున్నారు. దీనిపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోల్స్ వస్తున్నాయి. వాటిని అమోదించాలని సిద్దారెడ్డి వర్గీయులు కోరుతున్నా.. ప్రజలు నమ్మడం లేదు. నిజంగా రాజీనామాలు చేసే వారైతే సరైన ఫార్మాట్‌లో సంబంధిత అధికారులకు ఎందుకు ఇవ్వలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇలా రాజీనామాల వ్యవహారం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల తొలగింపు

● మరొకరి తొలగింపునకు రంగం సిద్ధం



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

విడపనకల్లు, జనవరి 1: రైతులకు అక్రమంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందించిన ఇద్దరు అధికారులను విధుల నుంచి ఆ శాఖ రాష్ట్ర అధికారులు తొలగించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలో విద్యుత్ అధికారుల అవినీతిపై ఆంధ్రజ్యోతిలో 2021 ఆగస్టు 6న డబ్బులిచ్చుకో.. ట్రాన్స్‌ఫార్మర్ తీసుకో..! శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై రాష్ట్ర విద్యుత్‌శాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి పాల్తూరు సబ్ స్టేషన్ పరిధిలోని ఇద్దరు సిబ్బందిని పూర్తిగా విధుల నుంచి తొలగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. పాల్తూరు పరిధిలో వందల కొద్దీ ట్రాన్స్‌ఫార్మర్లను కర్ణాటక, వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటుగా తెప్పించి నేరుగా రైతుల నుంచి డబ్బు వసూలు చేసి అక్రమ కనెక్షన్లు ఇచ్చారు. ఎక్కడ చూసినా అక్రమ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు విచారించి ఇద్దరు సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్లు సమాచారం. మరో అధికారిని కూడా తొలగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.

ఆస్పత్రిలో యువకుల వీరంగం..

● కేసు నమోదు చేసిన పోలీసులు

ధర్మవరం, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా కొందరు యువకులు ఆదివారం రాత్రి మద్యం సేవించి ప్రభుత్వాస్పత్రిలో వీరంగం సృష్టించి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల మేరకు... వినయ్‌గౌడ్ అనే యువకుడు మరికొందరు కలిసి మద్యం తాగి బైకు నుంచికింద పడి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి తక్షణమే వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ వైద్యులపై చిందులేయడంతో పాటు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. విధుల్లో ఉన్న డాక్టర్ చంద్రిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినయ్‌గౌడ్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


రమేశ్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, జనవరి 1: మండలంలోని మేడాపురంలో తలారి రమేశ్ (40) విద్యుదాఘాతానికి గురై సోమవారం మరణించాడు. ఉదయం ఇంటివద్ద వైర్‌పై బట్టలు ఆరవేస్తుండగా.. స్టే వైర్ ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో ఈ ప్రమాదం జరిగింది. విద్యుదాఘాతంతో ఒక్కసారి కుప్పకూలిన అతన్ని కుటుంబసభ్యులు వెళ్లి పరిశీలించగా.. అతను అప్పటికే మరణించినట్లు గుర్తించారు. తలారి రమేశ్ భార్య రామాంజినమ్మ మేడాపురం ఎంపీటీసీ-2. వీరికి ఒక కుమార్తె. మృతదేహాన్ని పోలీసులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రూ.లక్ష ఆర్థిక సాయం: తలారి రమేశ్ మృతి విషయం తెలుసుకున్న కనగానపల్లి మండలం రాంపురం గ్రామానికి చెందిన ప్రొఫెసర్ రాజేశ్ మేడాపురం గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. రామాంజినమ్మకు రూ.లక్ష చెక్కును అందజేశారు.

8 వరకు పింఛన్ల పెంపు వారోత్సవాలు

అనంతపురం టౌన్, జనవరి 1: జిల్లాలో ఈనెల నుంచి పింఛన్లు పెంచామని, ఇందుకోసం 8వతేదీ వరకు పింఛన్ల పెంపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టరు గౌతమి తెలిపారు. జిల్లాలో 2,31,513 మంది లబ్ధిదారులకు రూ.2,750 నుంచి రూ.3వేలకు పెంచినట్లు తెలిపారు. ఈ మేరకు పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కొత్తగా జిల్లాలో 5,234 పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని వీరికి సొమ్ము అందజేస్తామన్నారు. మొత్తం మీద 2,93,493 పింఛన్లకుగాను రూ87.92కోట్లు విడుదలయ్యాయన్నారు. పెంచిన పింఛన్ సొమ్ము పంపిణీ ముగిసేవరకు అన్నిమండలాలు, పట్టణ ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం: జేసీపీఆర్



తాడిపత్రి, జనవరి1: బాంబులు కాదు... ప్రజల సంక్షేమమే ధ్యేయం. వారి భవిష్యత్తుకు పూలబాట వేయాలని రాజకీయ నాయకులకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని స్థానిక నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు నాయకులు కొడతాం, నరుకుతాం అంటూ ప్రతీకారంతో రగిలిపోతున్నారని, అది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. తమను నమ్ముకున్న ప్రజలకు చేతనైనంత సాయం చేయాలని కోరారు. 2024లో అనేక రకాల విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. ప్రజారంజకంగా పాలించే టీడీపీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. ప్రజావ్యతిరేకంగా పని చేస్తున్న వైసీపీకి భంగపాటు తప్పదన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో ప్రజలు చాలా తెలివైనవారు అన్నారు. నియోజకవర్గంలో ప్రజల సంక్షేమం కోసం తనవంతుగా అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. తాను చేస్తున్న అభివృద్ధికి ప్రజల అండదండలు ఉండటం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.

రివర్స్ గేమ్


ఓ వైపు విద్యార్థినులు.. మరోవైపు వలంటీర్లు


పీటీసీలో క్రీడాకారులు లేక కుర్చీలు ఇలా ఖాళీ

- ఎవరి కోసం ఈ ఆటలు?
- వలంటీర్లు, విద్యార్థులే క్రీడాకారులట
- ఆడుదాం...అభాసుపాలు
- వెలవెలబోతున్న క్రీడామైదానాలు
- ఆసక్తి చూపని అసలైన ఆటగాళ్లు
- రూ.కోట్లు ప్రజాధనం వృథా


నాసిరకం షటిల్‌బ్యాట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 1: యువతను దగా చేస్తున్న ప్రభుత్వం. క్రీడల పేరుతో మభ్యపెడుతున్న వైనం. ఎన్నికల కోసం సీఎం జగన్ తీసుకువచ్చిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు అభాసుపాలైంది. ఎవరి మెప్పు కోసం ఇదంతా చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. ఓ వైపు క్రీడా కోచ్‌లు, పీడీ-పీఈటీల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పోటీలలో విజేతల సర్టిఫికెట్లు, పతకాలు ఎటువంటి ఉపయోగం లేవని సీఎం జగనే సాక్షాత్తు ప్రకటించి మరి రూ.కోట్లాది నిధులు ఎందుకు వృథా చేస్తున్నారని యువత ప్రశ్నిస్తోంది. క్రీడా మైదానాల్లో క్రీడాకారులు లేక ఓ వైపు వలంటీర్లు, మరోవైపు వైసీపీ కార్యకర్తలు, విద్యార్థులతో ఆటలాడిస్తున్నారు. అసలైన, అర్హులైన క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా పోటీల పట్ల నిరాసక్తి చూపుతున్నారు. రూ.కోట్లు వెచ్చించినా నాసిరకం క్రీడా కిట్లతో మభ్యపెడుతున్నారు. మరోవైపు టీషర్టులు వచ్చి నా అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలోనే ఉంచారు. ఇంతవరకు క్రీడాకారులకు అందించింది లేదు. మరోవైపు రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వాలు ప్రచారార్భాటాలు చేస్తున్నప్పటికీ మైదానాల్లో కనీస వసతులు మంచినీరు, నీడ, ఇతర వసతులు లేక అరకొరగా వచ్చి న క్రీడాకారులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రోగ్రాం రూపొందించేందుకు కోచ్‌లు, పీఈటీ-పీడీలను ఉపయోగించిన ప్రభుత్వం ఆటల నిర్వహణకు అవగాహన లేని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను ఉపయోగించి రివర్స్‌గేమ్ ఆడుతోంది.


అంపైర్లుగా సచివాలయ ఉద్యోగులు

రివర్స్ గేమ్

రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి రివర్స్ గేర్‌లోనే వెళ్తోంది. అదే ఆనవాయితీని ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో కొనసాగిస్తోంది. పోటీల్లో అసలైన క్రీడాకారులకు అవకాశం ఇవ్వకుండా వలంటీర్లు, వైసీపీ కార్యకర్తలు, విద్యార్థులనే ఆటలాడిస్తున్నారు. ఓవైపు ఇలా బలవంతంగా ఆడిస్తుండగా, మరో వైపు మైదానాల్లో క్రీడాకారులు లేక వెలవెలబోతున్నాయి. ఆడుదాం ఆంధ్రా ప్రోగ్రాంకు సంబంధించి వివరాల నమోదుకు సాధారణంగా గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులను వినియోగించాలి. క్రీడా పోటీల నిర్వహణకు కోచ్‌లు, పీడీ-పీఈటీలను వినియోగించాలి. అయితే వైసీపీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వినియోగిస్తోంది. ప్రోగ్రాం రూపొందించేందుకు కోచ్‌లు, పీడీ-పీఈటీలను వినియోగించిన ప్రభుత్వం, ఆటల నిర్వహణకు ఇతరులను వినియోగించడం రివర్స్ గేమ్‌లో వెళ్తోంది.

వలంటీర్లు, విద్యార్థులే క్రీడాకారులట!

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు రిజిస్ట్రేషన్‌లు ఫుల్... ఆడేవారు నిల్ అన్న చందంగా మారింది. ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రభుత్వం ప్రచారాస్త్రంగా ఎంచుకుంది. ఈ నేపథ్యంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో కబడ్డీ పోటీలకు క్రీడాకారులు లేక ఓ వైపు విద్యార్థినులు, మరోవైపు వలంటీర్లను పెట్టి ఆడించారు. జిల్లా కేంద్రంలోని పీటీసీ, ఆర్ట్స్ కళాశాల, న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానాల్లో నిర్వహించిన క్రికెట్ పోటీలు విచిత్రంగా సాగాయి. క్రీడాకారులు లేక మైదానాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఓ వైపు క్రీడాకారులుగా మరోవైపు అంపైర్లు, స్కోరర్లుగా దర్శనమిచ్చారు. ఇక క్రీడాకారులకు ఎటువంటి జెర్సీలు, షూలు లేకుండా షరా మామూలే అనిపించేశారు.

ఎవరి కోసం ఈ ఆటలు?



ఆడుదాం ఆంధ్రా అంటూ ఎవరి కోసం ఈ క్రీడా పోటీలు? క్రీడాకారులు లేకుండా ఆటల పోటీలు నిర్వహించడం ఎక్కడా చూడలేదు. ఉపయోగపడని సర్టిఫికెట్లు, పతకాలు ఎవరి కోసం? క్రీడాకారులకు అవకాశం లేకుండా ఇతరుల కోసమే చేపడుతున్నారు. వెంటనే ప్రభుత్వం అర్హులైన అసలైన క్రీడాకారులకు అవకాశాలు కల్పించాలి. ఇదంతా కేవలం ప్రచారం కోసం చేస్తున్నారని తెలుస్తోంది. యువతను మోసం చేస్తున్న ప్రభుత్వంపై కచ్చితంగా పోరాడాల్సిన సమయం వచ్చింది.

- వెన్నెల, క్రీడాకారిణి

ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు



ఆడుదాం ఆంధ్రా అంటూ క్రీడా పోటీలతో వైసీపీ ప్రభుత్వం రూ.కోట్లాది నిధులను దుర్వినియోగం చేస్తోంది. జిల్లాలో ఈ పోటీలకు రూ.10కోట్లు వరకు ఖర్చు చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చిన క్రీడాకారులను విస్మరిస్తున్న ప్రభుత్వ వైఖరి మారాలి. ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సాహించేలా పతకాలు అందజేసి, నగదు ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం ఎన్నికల స్టంట్



ఎన్నికలు సమీపిస్తుండడంతోనే ప్రచారార్భాటం కోసం సీఎం జగన్ తన అధికారమదంతో ఆడుదాం ఆంధ్రా అంటూ యువతను మభ్యపెడుతున్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు లేరు. అంతా వలంటీర్లు, వైసీపీ కార్యకర్తలే. ఎక్కడ చూసినా జగన్ బొమ్మలతో నాసిరకం క్రీడా కిట్లు ఇచ్చారు. అది కూడా ఎమ్మెల్యేలు ఎవరికి చెబితే వారికే ఇచ్చారు. అసలైన, అర్హులైన క్రీడాకారులను కించపరిచేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. వెంటనే ఈ పోటీలను నిలిపివేయాలి.

- సంతోష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి

తాగేశారు..!



- న్యూ ఇయర్ వేడుకల్లో మద్యం మత్తులో యువత
- ఉమ్మడి జిల్లాలో ఒక్క రోజులో రూ.7.46 కోట్ల విక్రయాలు

అనంతపురం అర్బన్, జనవరి 1: నూతన సంవత్సరం వేడుకల్లో మద్యం మత్తులో యువత మునిగి తేలింది. స్నేహితులతో కలిసి తాగి ఊగారు. 2024 నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ కొందరు అర్ధరాత్రి కేక్‌లు కట్ చేసుకొని సంబరాలు చేసుకోగా, ఎక్కువ శాతం యువత మద్యం, విందు పార్టీలు చేసుకొని మత్తులో మునిగితేలారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మద్యం ప్రియులతో కిటకిటలాడాయి. అర్ధరాత్రి 1 గంట దాకా బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వహణకు అనుమతించడంతో అప్పటి దాకా మద్యం ప్రియులు అక్కడే గడిపారు. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తున్నామన్న పేరుతో సాధారణంగా తాగే స్థాయి కంటే కొంచెం ఎక్కువగానే మందు తాగారు. గత నాలుగేళ్లకంటే ఈసారి ఎక్కువగా మద్యం తాగేశారు. అనంతపురం జిల్లాలో 2023 సంవత్సరం ఆఖరు రోజు ఆదివారం రూ.5కోట్లు విలువైన మద్యం, బీర్లు తాగేశారు. సత్యసాయి జిల్లాలో 2.46 కోట్లు విదులైన మద్యం, బీర్లు తాగారు. ఉమ్మడి జిల్లాలో ఒక్కరోజులో రూ.7.46 కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. 2022 సంవత్సరం ఆఖరు రోజు అనంత జిల్లాలో రూ.4.43 కోట్లు విలువైన మద్యం, బీర్లు తాగేశారు. సత్యసాయి జిల్లాలో రూ.2.12 కోట్ల విలువైన మద్యం, బీర్లు తాగేశారు. ఉమ్మడి జిల్లాల్లో మొత్తం రూ.6.55కోట్లు విలువైన లిక్కర్, బీర్లు తాగారు. గతంతో పోలిస్తే ఈసారి రూ.91 లక్షల మద్యాన్ని ఎక్కువగా తగినట్లు ఎక్సైజ్ అధికారుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

అనంత జిల్లాలో ఏటా డిసెంబరు 31న మద్యం విక్రయాలిలా..

ఏడాది	లిక్కర్ కేస్‌లు	బీర్ కేస్‌లు	మొత్తం విలువ (రూ.కోట్లలో)
2019	4054	2738	37656760
2020	2626	1675	33313470
2021	3596	2099	41434640
2022	3720	2262	44356010
2023	3888	2766	50000000

శ్రీసత్యసాయి జిల్లాలో మద్యం విక్రయాలిలా..

ఏడాది	లిక్కర్ కేస్‌లు	బీర్ కేస్‌లు	మొత్తం విలువ (రూ.కోట్లలో)
2019	2098	2005	19923160
2020	1371	1023	17561570
2021	1828	1160	20707170
2022	1870	1387	21260340
2023	1880	1415	24600000

గతంతో పోలిస్తే పెరిగిన విక్రయాలు

నాలుగేళ్లతో పోలిస్తే 2023 సంవత్సరం ఆఖరు రోజు మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా ఉమ్మడి అనంత జిల్లాలో ఒక్క రోజులో రూ.7.46 కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరిగాయి.

- రామమోహన్‌రెడ్డి, ఐఎంఎల్ డిపో మేనేజర్

మమ్మల్ని ఎందుకు తొలగించారు?

● ఎంపీడీవోను నిలదీసిన వలంటీర్లు


ఎంపీడీవో రామచంద్రకు వినతిపత్రం ఇస్తున్న వలంటీర్లు

బెళుగుప్ప, జనవరి 1 : గత నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పథకాలను పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందించిన తమను ఎందుకు విధుల నుంచి తొలగిస్తున్నారంటూ బెళుగుప్పకు చెందిన వలంటీర్లు లింగప్ప, పవిత్ర, అనితమ్మ సోమవారం ఎంపీడీవో రామచంద్రను నిలదీశారు. మండలంలో ఐదుగురు వలంటీర్లను విధుల్లో నిర్లక్ష్యం వహించారనే కారణంతో మూడు రోజుల కిందట తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బెళుగుప్పలో ముగ్గురు, ఆవులెన్నలో ఎర్రమ్మ, వెంకటేశులును తొలగిస్తూ ఆదేశాలొచ్చాయని గ్రామ సెక్రెటరీల ద్వారా ఎంపీడీవో వీరికి సామాచారమందించారు. వీరు పని చేస్తున్న లబ్ధిదారులతో కలిసి కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవోను నిలదీశారు. తమ పరిధిలో ఏమీ లేదని, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో తొలగిస్తున్నట్లు ఎంపీడీవో వారికి సమాధానమిచ్చారు.

రైతును ముంచిన ప్రభుత్వం: సీపీఎం

ఉరవకొండ, జనవరి 1: వైసీపీ ప్రభుత్వం రైతులను నిలువునా ముంచిందని సీపీఎం నాయకులు విమర్శించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రైతు సమస్యలపై ధర్నా నిర్వహించారు. మోకాళ్లపైన నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ రైతులకు బీమా, పరిహారం వెంటనే ఇవ్వాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు, పంటవేయని రైతులకు ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలన్నారు. హంద్రీనీవా ద్వారా హెచ్చెల్సీ, జీబీసీ ఆయకట్టు పంట పూర్తయ్యే వరకూ సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధుసూదన్, రంగారెడ్డి, మురళి, శ్రీనప్ప, వినోద్ కుమార్, వెంకటేశులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దేవదాయ శాఖ ఈఓ మృతి


నాగేంద్రప్రసాద్‌రావు (ఫైల్)

మడకశిర రూరల్ జనవరి 1: మడకశిర డివిజన్‌లో దేవదాయ శాఖ ఈఓగా పని చేస్తున్న నాగేంద్ర ప్రసాద్‌రావు సోమవారం మృతిచెందారు. వారు మాట్లాడుతూ 2021లో మడకశిర దేవదాయ శాఖ ఈఓ నాగేంద్రప్రసాద్ రావు బాధ్యతులు స్వీకరించినట్లు తెలిపారు. భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట అంజనేయస్వామి గ్రూప్ దేవాలయాలతో పాటు హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారు. శనివారం ఆయన మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఈయనకి భార్య, కూతురు ఉన్నారు.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

- నాయకులకు పార్టీల శ్రేణుల శుభాకాంక్షలు
- కిటకిటలాడిన నివాసాలు, పార్టీల కార్యాలయాలు


పరిటాల శ్రీరామ్‌కు గజమాల వేసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌లైన్ నెట్‌వర్క్: నూతన సంవత్సర వేడుకలను పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిపారు. నియోజకవర్గ కేంద్రాలతోపాటు మండలకేంద్రాలు, గ్రామాల్లో యువత మధ్యరాత్రి 12 గంటల నుంచే సందడి చేసింది. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బాణసంచా కాల్చి, కేక్‌లు కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మరికొందరు ఫోన్ల ద్వారా, మెసేజ్‌ల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇక ఉదయం పలువురు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. ముఖ్యంగా కార్యాలయాల్లోనూ, నాయకుల ఇళ్ల వద్ద వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని పార్టీల నాయకుల ఇళ్ల వద్దకు కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ధర్మవరంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి నియోజకవర్గవ్యాప్తంగా అన్ని మండలాల నుంచి పార్టీశ్రేణులు భారీగా తరలివచ్చారు. దీంతో పార్టీ కార్యాలయం కిటకిటలాడింది. అభిమానులు, నాయకుల సమక్షంలో శ్రీరామ్ కేక్‌కట్‌చేశారు. ఈసందర్భంగా కేక్‌ను పలువురికి పంపిణీ చేశారు. జనసేన పార్టీ రాష్ట్రప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి నివాసమూ నాయకులు, కార్యకర్తలతో కిటకిటలాడింది. అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతపురంలోని తన గృహంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అభిమానుల మధ్య ఆయన కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



గోనుగుంట్ల సూర్యనారాయణకు, చిలకం మధుకు గజమాలలతో శుభాకాంక్షలు తెలుపుతున్న అనుచరులు

కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే చేకూరాలి

- జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్


జూనియర్ సివిల్ న్యాయాధికారిని సన్మానిస్తున్న న్యాయవాదులు

పుట్టపర్తిరూరల్, జనవరి 1: నూతన సంవత్సరంలో న్యాయవాదులు వృత్తినైపుణ్యంలో రాణించాలని, కక్షిదారులకు అన్నీ శుభాలే జరగాలని పుట్టపర్తి జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ ఆకాంక్షించారు. నూతన సంవత్సర వేడుకలను పట్టణంలోని బార్‌అసోషియేషన్ కోర్టు చాంబర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయాదికారి కేక్ కట్ చేశారు. న్యాయవాదులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలతో సన్మానించారు. తర్వాత న్యాయాధికారి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో న్యాయవాదులు తమ వృత్తి నైపుణ్యంలో రాణించాలన్నారు. తద్వారా కక్షిదారులకు అన్ని శుభాలే జరగాలన్నారు. బార్ బెంచ్ మధ్య సుహృద్భావ వాతావరణంలో కోర్టు పనిచేసిందని, కొత్తసంవత్సరం కూడా అదేసాంప్రదాయాన్ని కొనసాగించి కేసుల సత్వర పరిస్కారానికి కృషి చేద్దామని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తిరాజారెడ్డి, న్యాయవాదులు యదుభూషణ్, రాజేంద్రప్రసాద్, అతావుర్ రహిమాన్, పూజారి ప్రసాద్, శ్రీనివాసులు, నాగమల్లేశ్వరరెడ్డి, అర్బన్ సీఐ కొండారెడ్డి, అర్బన్, రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాల్సిందే

- అంతవరకు సమ్మె విరమించం • స్పష్టం చేసిన అంగన్‌వాడీలు • 21వ రోజుకు చేరిన సమ్మె


ఓడీసీలో ఒంటికాలిపై నిలబడి నిరసన..


ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మెలో..

ఆంధ్రజ్యోతి, న్యూస్‌లైన్ నెట్‌వర్క్: ప్రభుత్వం తమ సమస్యల్ని ఎట్టిపరిస్థితుల్లోనూ పరిష్కరించాల్సిందేనని అంగన్‌వాడీ సిబ్బంది పట్టుపట్టారు. అంతవరకు సమ్మె విరమించేదే లేదని భీష్మించారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ వారు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 21వ రోజుకు చేరింది. ఈ క్రమంలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లోని అన్ని పట్టణాలు, మండలకేంద్రాల్లో వారు ర్యాలీలు, నిరసనలు చేపట్టారు. కదిరిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అలాగే ముదిగుబ్బలో సమ్మె శిబిరం వద్ద ఆటపాటలతో నిరసన వ్యక్తం చేశారు. ఓబుళదేవరచెరువు మండలం మహమ్మదాబాద్ క్రాస్‌లోని సీడీపీఓ కార్యాలయం ఎదుట ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. వారికి సీఐటీయూ, రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను తప్పక పరిష్కరించాల్సిందేనన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం జగన్ కాలయాపన చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు పెంచాలని, గ్రాట్యూటీ రూ.5లక్షలు అమలు పరచాలని, ఇంకా తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


ముదిగుబ్బలో ..


తనకల్లులో..


నంబుపూలకుంటలో..

ఏడో రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె


పుట్టపర్తిలో వంటావార్పుతో నిరసన తెలుపుతున్న కార్మికులు


కదిరి శిబిరంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున

పుట్టపర్తి/ ధర్మవరం/ కదిరి అర్బన్, జనవరి 1: సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ వారు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి ఏడో రోజుకు చేరింది. పుట్టపర్తిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వంటావార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించమన్నారు. అధికారులు చెత్త తీయడానికి ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. మాసమస్యలు పరిష్కరించకుండా చెత్త ఎలా తీస్తారని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోతే మాసత్తా చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంగాధర్, బాబా, మున్సిపల్ కార్మికులు నాగార్జున, గోవిందు, నరసింహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఇక ధర్మవరంలో మున్సిపల్‌పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు ఎస్ఎఫ్ఐ జిల్లాప్రధాన కార్యదర్శి నాగార్జున సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి వారి సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు, ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగపు ఉద్యగుల సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. కదిరి మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. వీరికి మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగేంద్రనాథ్, శ్రీనివాసులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బాలకృష్ణ, జనార్ధన, సూరి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

దీక్షలను విజయవంతం చేయండి

కదిరి అర్బన్, జనవరి 1: అగ్రిగోల్డు కస్టమర్స్, ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 3,4వ తేదీల్లో విజయవాడలో జరుగు దీక్షలను జయప్రదం చేయాలని ఆ అసోసియేషన్ నాయకులు అత్తార్ మహబూబ్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే అగ్రిగోల్డు బాధితుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, అయితే అధికారం చేపట్టి ఐదేళ్లగడుస్తున్నా హామీలు నేరవేర్చలేదని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు కస్టమర్లు, ఏజెంట్లు ఆత్మహత్య చేసుకున్నా.. ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి అగ్రిగోల్డు బాధితులను ఆదుకోవాలని కోరారు. విజయవాడలో జరిగే దీక్షకు ఏజెంట్లు, కస్టమర్లు తప్పక పాల్గొనాలని ఆయన కోరారు.

వృద్ధాశ్రమానికి ఆర్థికసాయం

అమడగూరు, జనవరి 1: మండలంలోని గాజుపల్లి సమీపంలో శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమానికి తనకంటివారిపల్లికి చెందిన రామమోహన్, విజయలక్ష్మి దంపతులు సోమవారం రూ.పదివేల ఆర్థికసాయం అందించారు. తమ కుమారుడి జన్మదినం సందర్భంగా వారు ఈ సాయం చేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు అరుణజ్యోతి తెలిపారు.

వైభవంగా మల్లారమ్మ ఉట్లోత్సవం


ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడుతున్న యువకులు

ఓబుళదేవరచెరువు, జనవరి 1: మండలంలోని వెంకటాపురం పంచాయతీ నారప్పగారిపల్లిలో సోమవారం మల్లారమ్మ ఉట్లోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవంలో ఉట్లమానును ఎక్కి ఉట్టి కొట్టేందుకు పలువురు యువకులు పోటీ పడ్డారు. అలాగే చెక్కభజన, కోలాటం, జక్కీకు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, పార్వేట నిర్వహించారు. భక్తులకు గ్రామస్థులు అన్నదానం చేపట్టారు.


ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ నాయకుల ర్యాలీ

ముదిగుబ్బ, జనవరి1: మండలంలోని తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ కూడలి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వాహనాలలో ధర్మవరం తరలివెళ్లారు.

గోనుగుంట్ల వర్గీయుల ర్యాలీ..

అలాగే మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు కూడా స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత గోనుగుంట్ల సూర్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపేందుకు అనంతపురం తరలి వెళ్లారు.


ర్యాలీ చేస్తున్న గోనుగుంట్ల వర్గీయులు

ప్రతి ఇంటికీ అయోధ్య రాముడి అక్షింతలు


అక్షింతలతో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూపరిషత్ సభ్యులు

ధర్మవరం/ ధర్మవరం రూరల్, జనవరి 1: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి పవిత్ర అక్షింతలను సోమవారం పట్టణంలో విశ్వహిందూపరిషత్ వారు ప్రతి ఇంటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పులిచెర్ల వేణుగోపాల్ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలోని రామమందిరంలో శ్రీరాముల వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరగనుందని, ఆ రోజున సాయంత్రం ప్రజలు ప్రతి ఇంటి ముంగిట ఐదు దీపాలు వెలిగించి అక్షింతలను తలపై వేసుకోవాలని సూచించారు. అలాగే దగ్గరలో ఉన్న రామాలయాన్ని దర్శించుకోవాలన్నారు. అక్షితలతో పాటు దేవాలయం నమునాచిత్రపటం, ప్రాణప్రతిష్ఠ అహ్వానపత్రాలను అందజేశారు. తొలుత ప్రధాన వీధిలో అక్షింతలను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించా రు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ , కోదండరామ స్వామిఆలయ కమిటీ సభ్యులు సోమశేఖర్,పూజారి వెంకటరాముడు, మధు, దాసరి హరి, కృష్ణమూర్తి, బలరాముడు, గంగప్రసాద్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: అయోధ్య రామాలయం అక్షింతలు సోమవారం రాత్రి జిల్లా కేంద్రానికి చేరాయి. విశ్వహిందూపరిషత్ సభ్యులు, భక్తులు ఆ అక్షింతలను విద్యాగిరినుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆంజనేయ స్వామి ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ భద్రపరిచారు. రేపు జిల్లా కేంద్రంలోని ప్రతి ఇంటికీ వాటిని పంపిణీ చేయనున్నట్లు విశ్వహిందూపరిషత్ వారు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కత్తి రాజా, బాలగంగాధర్, నాగార్జునశెట్టి, బొగ్గరం శ్రీనివాసులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


పుట్టపర్తిలో మాజీమంత్రి పల్లెకు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు



కలెక్టర్ అరుణ్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్

ఎస్టీయూ వజ్రోత్సవ వాల్‌పోస్టర్ విడుదల

కొత్తచెరువు, జనవరి 1: ఎస్టీయూ 75వ వజ్రోత్సవ వేడుకల వాల్‌పోస్టర్లను సోమవారం మండలకేంద్రంలోని డీఈఓ కార్యాలయ ఆవరణలో డీఈఓమీనాక్షి ఆవిష్కరించారు. ఈనెల 12, 13 వ తేదీలలో కర్నూలులోని ఎగ్జిబిషన్ క్రీడామైదానంలో జరిగే ఎస్టీయూ 75వ వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయసమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు బీఎన్ ప్రసాద్, దొడ్డం రవీంద్ర, కోనంకి చంద్రశేఖర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్

తనకల్లు, జనవరి 1: మండలంలోని మల్లిరెడ్డిపల్లి, బొంతలపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. జనజాగృతి ఆధ్వర్యంలో ఈదులవంక, గొళ్లపల్లి, పెద్దపల్లి, గ్రామాల్లో నాబార్డు సహకారంతో చేపట్టిన వాటర్ షెడ్ పథకాలను తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, ఈఓఆర్డీ ఆనందయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ కవిత, వ్యవసాయాధికారి శ్రీహరినాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, ఉపాధి అధికారి మరియమ్మ, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శిల్పారామంలో న్యూఇయర్ వేడుకలు

పుట్టపర్తి, జనవరి 1: పట్టణంలోని శిల్పారామం లో సోమవారం సాయంత్రం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. డీజే డ్యాన్సులు, జబర్దస్ కామెడీలతో యువత హుషారెత్తించారు. దాదాపు రెండుగంటలపాటు సాగిన డ్యాన్సులు సందర్శకులను అలరించాయి. కార్యక్రమంలో శిల్పారామం మేనేజర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శిల్పారామంలో డ్యాన్సు వేస్తున్న చిన్నారులు

అలరించిన ప్రేమబంధం

పుట్టపర్తి, జనవరి 1: సత్యసాయి విద్యార్థులు ప్రేమబంధం నాటికతో భక్తులను అలరించారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయి కుల్వంత్ హాల్‌లో సోమవారం సాయంత్రం విద్యార్థులు ప్రేమబంధం పేరుతో సంగీత, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి ప్రేమతత్వంపై నాటిక ప్రదర్శించి, భక్తిగీతాలు అలపించారు. ఈ కార్యక్రమాలు శ్రోతలను ఎంతగానో అలరించాయి. అనంతరం విద్యార్థులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల పోస్టుకార్డుల ఉద్యమం


ఉత్తరాలు పోస్ట్ చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

పుట్టపర్తి రూరల్, జనవరి 1: విద్యాశాఖలో విధులు నిర్వర్తిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు తమ సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. వారు తమ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారానికి 13వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా సమగ్రశిక్ష కాంటాక్టు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం నుంచి గణేష్‌కూడలి, ఆర్టీసీ బస్‌డిపో మీదుగా పోస్టాఫీసు వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ తమ సమస్యలపై ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాసి పోస్టుబాక్స్‌లో వేశారు. ఈసందర్భంగా వారికి మద్దతు తెలిపిన సీఐటీయూ నాయకుడు ఈఎస్ వెంకటేసు మాట్లాడుతూ నిరవధిక సమ్మె చేపట్టి 13రోజులు అవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా మేల్కొని ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు ఓబిరెడ్డి, నాయకులు రామన్న, వెంకటరమణ, రవి, నాగరాజు, ఓబులేసు, స్వర్ణ, సోమశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కందికుంట జన్మదిన వేడుకలు


కందికుంటకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న 24వ వార్డు కౌన్సిలర్ అల్భాముస్తఫా


పూలమాల వేస్తున్న టీడీపీ నాయకుడు కొమ్మినేని గంగయ్య నాయుడు తదితరులు

కదిరి, జనవరి 1: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ జన్మదిన వేడుకలను పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచే ఆయన నివాసం వద్ద సందడి మొదలైంది. సరిగ్గా అర్థరాత్రి 12గంటల తరువాత కందికుంట కేక్‌ను కట్ చేశారు. పట్టణంలోని కాలేజీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్, జీవిమాన్ సర్కిల్, నిజాంవలీకాలనీ తదితర ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకలతో పాటు కందికుం ట జన్మదిన వేడుకలను అభిమానులు జరిపారు. అనంతరం ఉదయం పట్టణంతోపాటు మండలాలనుంచి అభిమానులు, నాయకులు పెద్దఎత్తున కందికుంట నివాసం వద్దకు వచ్చి శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఉద్యోగులు సైతం శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో బంగారు కృష్ణమూర్తి నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో కందికుంట అన్నదానం చేపట్టారు.

తనకల్లు: కందికుంట వెంకటప్రసాద్ జన్మదిన వేడుకలను మండలకేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కందికుంటకు ఘన స్వాగతం పలికి పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. ఆలయంలో కందికుంట ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. యూత్ మండల నాయకుడు కావడి ప్రవీణ్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణమోహన్ నాయుడు


అన్నదానం చేస్తున్న కందికుంట, బంగారు కృష్ణమూర్తి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మడకశిరలో అంజనేయస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

మడకశిర టౌన్, జనవరి 1: ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను సోమవారం పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. 2024 సంవత్సరంలో అందరికీ శుభం కలగాలని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చాలా మంది యువకులు మడకశిర కొండపైకెక్కి రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశాంచారు. అక్కడే నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి పట్టణంలోని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని మిట్టబండ ఆంజనేయస్వామి, కోట వెంకటేశ్వరస్వామి, షిర్డీసాయినాథ్, చంద్రమౌళేశ్వరస్వామి ఆలయాల్లో అనేక మంది భక్తులు పూజలు చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంబరాలు అంబరాన్నంటాయి.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

రొద్దం: మండలంలోని రాచూరులో ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండల పరిధిలోని రాచూరులో ఆలయం జీర్ణోద్ధరణ చేశారు. ఇందులో భాగంగా విగ్రహప్రతిష్ఠ చేపట్టారు. మూడు రోజులుగా దేవాలయంలో వివిధ రకాల పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి బంధువులు, శ్రేయోభిలాషులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. మూడు రోజులుగా ఆలయంలో తీర్థ ప్రసాదం వినియోగం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పెనుకొండ, జనవరి 1 : స్థానిక బైబిల్ మిషన్ చర్చిలో నూతన సంవత్సర వేడుకలను పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చర్చికి హాజరైన క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలు సుఖశాంతులతో సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు బాగా పడి సమృద్ధిగా పంటలు పండాలని యేసు ప్రభువును ప్రార్థించారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గుడిబండ, జనవరి 1 : త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తదితరులు పేర్కొన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల లువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ వచ్చే ఎన్నికల్లో టీడీపీ అత్యధిక స్థానాలు కైవశం చేసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడం లక్ష్యంగా పనిచేద్దామరు. వైసీపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరో పించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ పార్టీకి ప్రజలు సరైన గుణపాఠం చెబు తారన్నారు. అనంతరం గుడిబండ నుంచి మడకశిరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, దుర్గేష్, నాయకులు పురుషోత్తం, లక్ష్మీనరసప్ప, భీమరాజు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి మృతికి సంతాపం

హిందూపురం, జనవరి 1 : పరిగి మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సచివాలయ ఉద్యోగి శ్రీనివాసులకు మునిసిపల్ కార్యాలయంలో సంతాపం తెలిపారు. శ్రీనివాసులు పట్టణంలోని 23వ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుండేవారు. ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో పరిగికి వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును బెంగళూరుకు తీసుకెళ్లి చికిత్సలు అందిస్తుండగా మృతిచెందాడు. దీంతో సోమవారం మునిసిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ ప్రమోద్‌కుమార్, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది శ్రీనివాసులు మృతిపట్ల సంతాపం తెలిపారు.

విజయోత్సవ ర్యాలీ



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

పావగడ, జనవరి 1 : భీమాకోరెగావ్ విజయోత్సవ ర్యాలీని పట్టణంలో సోమవారం పావగడ సంవిధాన బళగ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐబీ నుంచి అంబేడ్కర్ సర్కిల్, కనకదాస సర్కిల్ మీదుగా శనిమహాత్మ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జైభీమ్ నినాదాలతో కోరెగావ్ యుద్ధంలో గెలిచిన మెహర్ నాయకలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారి లో దళిత నాయకులు రమేష్, దగ్గెప్ప, నరసింహ, నాగరాజు, మురలి, మద్దిలేటి, అమ రీష్, వెంకటేష్, తదితరులు ఉన్నారు. 206సంవత్సరాల కిందట 1818లో జనవరి 1న భీమానది తీరంలో మరాఠా రాజులతో జరిగిన యుద్ధంలో మెహర్ జాతికి చెందిన సైనికులు సాధించిన విజయానికి భీమకోరంగావ్ అని పేరు వచ్చిందని కర్ణాటక బౌద్ధ సమాజ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సుబ్బరాజు తెలిపారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్, మెహర్ సైనికుల్లా పనిచేస్తే విజయం సాధ్యమవుతుందని డీజేఎస్ నాయకుడు నారాయణప్ప కోరారు. బైక్‌ర్యాలీలో వందలాది మంది యువకులు పాల్గొన్నారు.



పురంలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు



పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బీకే పార్థసారధి



పెనుకొండలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

నూతన సంవత్సరం 2024కు ఘనంగా స్వాగతం పలికారు. కొత్త సంవత్సరం వేడుకలు ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు జరిగాయి. పురంలో వివిధ పార్టీ నాయకుల ఇళ్లు, కార్యాలయాలకు ఆయా పార్టీల కార్యకర్తలు, అధికారులు వెళ్లి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ ఇంటికి పెద్దఎత్తున తరలి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ పట్టణ, రూరల్ నాయకులు అంబికా నివాసంతోపాటు పలుచోట్ల కేక్‌లు కట్‌చేశారు. వైసీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. మునిసిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు సిబ్బంది, నాయకులు శుభాకాంక్షలు తెలుపగా చైర్‌పర్సన్ ఇంద్రజ ఇంటివద్ద వేడుకలు జరుపుకున్నారు. మునిసి పల్ మాజీ చైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మి ఇంటివద్ద వేడుకలు జరుపుకున్నారు. ముఖ్య అధికారులకు సిబ్బంది తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. బీకేతో కేక్ కట్‌చేయించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని హాస్టల్ నంబరు-1లో బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. మడకశిరలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. సాయిడెవలపర్స్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమరాపురం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మద్దన కుంట ఈరన్న స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలతో పాటు ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే ఆయా మండల కేంద్రాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అగళిలో జడ్పీటీసీ ఉమేష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అనంతరం ఆయనతో పాటు టీడీపీ నాయకుడు వీఎం పాండురంగప్ప తదితరులు మడకశిరలో గుండుమల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. మడకశిర మండలంలోని నీలకంఠాపురంలో సీడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డికి నియోజకవర్గంలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

ఒక్క చాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం : సవిత

పెనుకొండ టౌన్: ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన సీఎం జగన్‌కు ఈ యేడాది నుంచి పతనం షురూ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. ఆమె సోమవారం నూతన సంవత్సరం వేడుకలను పట్టణంలోని స్వగృహంలో, వ్యక్తిగత కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సీపీఎం, సీపీఐ, పలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం సవితను పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆమె అనుచరులు, కురుబ కులస్థులు శాలువాకప్పి సన్మానించారు.



గుండుమల తిప్పేస్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

టీడీపీ విజయాన్ని అడ్డుకోలేరు

రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, జనవరి 1: టీడీపీ అధికారంలోకి రాకుండా చేయాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు తెలుగుదేశం పార్టీ వైపే ఉన్నారని టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీదే అధికారమన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేసిన నాయకులు, కార్యకర్తలను ఆయన ఆధ్వర్యంలో పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. అనంతరం సమావేశంలో గుండుమల మాట్లాడారు. 2024వ సంవత్సరం ఎంతో కీలకమన్నారు. ఎన్నికల ఏడాది కావడంతో... నాయకులు, కార్యకర్త లు సమష్టిగా కృషి చేసి టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుదామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అవ లంబించిన ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వవైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగడుతూ... టీడీపీ బలోపేతానికి ముందుకు సాగుదామన్నారు. పాదయాత్ర, గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీని సీఎం జగన్ పూర్తిగా అమలు చేయలేక పోయారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళాశక్తి పేరుతో సూపర సిక్స్ సంక్షేమ పథకాలను అందిస్తామని చంద్రబాబు స్పష్టంగా తెలిపారన్నారు. దీనిని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వివరించాలని సూచించారు. రాష్ట్రానికి భవిషత్తు కావాలంటే చంద్రబాబు తప్పక రావాలని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. దళితలపై జరుగుతున్న దాడులు ఆగాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గం అధ్యక్షుడు ఆర్ జయకుమార్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు భక్తర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్లు లక్ష్మీ నారాయణ, దాసిరెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, నాయకులు హనుమంతేగౌడ్, కరియన్న, నాగేంద్ర, శివరుద్రప్ప, గణేష్, మల్లికార్జున తో పాటు నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసల పర్వం

మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. మండలంలోని హరేసముద్రం, సీ కోడిగేపల్లి, రొళ్ళ మండలంలోని కాకి గ్రామానికి చెందిన 140 కుటుంబాలవారు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారి గుండుమల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో భవిష్యత్తులో టీడీపీలోకి భారీగా చేరికలు ఉండనున్నట్లు గుండుమల తెలిపారు.

అసైన్డ్ భూముల్లో ఆగని అక్రమ కట్టడాలు

అధికారులు నోటీసులు ఇచ్చినా లెక్కచేయని వైసీపీ నాయకులు



అమ్మవారిపల్లి అసైన్డ్ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణం

పెనుకొండ రూరల్, జనవరి1: ఎంత ధైర్యం... ఎంత ధైర్యం... అధికారం ఉంది కదా అని ఓ వైసీపీ నాయకుడు అసైన్డ్ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నాడు. దీనిపై అధికారులు నోటీసులు అందించినా వాటిని బేఖాతరుచేసి నిర్మిస్తున్న వైనం పెనుకొండ మండలం అమ్మ వారిపల్లిలో చోటుచేసుకుంది. పట్టణంలోని కియ కార్లపరిశ్రమ ఏర్పాటు కావడంతో అమ్మవారిపల్లి, గుట్టూరు గ్రామాల్లో వ్యాపార సముదాయాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ఇదే అదునుగా బావించిన అ మ్మవారిపల్లిలోని 806సర్వే నంబరులో ఐదెకరాల అసైన్డ్ భూమిలో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల ద్వారా పలువురు లబ్ధి పొందుతున్నారు. మరోవైపు ఆ భూ మిలో అక్రమంగా హోటళ్లు, కంటైనర్లు పెద్ద పె ద్ద భవనాలు నిర్మిస్తున్నారు. దీనిపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. స్పందించిన అధికారులు వైసీపీ నాయకులకు నోటీసులు జారీచేశారు. ఇవేవీ లెక్కచేయకుండా ఎలాంటి అనుమతులు పొందకుండానే అసైన్డ్ భూమిలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు నిర్మిస్తుండటంపై పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సురేష్‌ను వివరణ కోరగా అసైన్డ్ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మించడం తమ దృష్టికి రాలేదన్నారు. విచారణచేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పురంలోని దీక్షాశిబిరంలో అంగన్‌వాడీలు



పెనుకొండలో కబడ్డీ ఆడుతూ..

ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు

అంగన్‌వాడీల ధ్వజం.. కొనసాగిన నిరసనలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది అంగన్‌వాడీ మహిళలు 21రోజులుగా నిరసన తెలుపుతుంటే ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తంచేశారు. అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం స్పందించి తగు నిర్ణయం తీసుకోక పోవడం దారుణమని మండిపడ్డారు. నూతన సంవత్సరం మొదటి రోజు అయినా సమ్మెలో భాగంగా వారు సోమవారం నిరసన చేపట్టారు. హిందూపురంలోని పాత బీపీఎల్ షోరూమ్ వద్ద శిబిరంలో నిరసన కొనసాగించారు. అలాగే పెనుకొండలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో కబడ్డీ ఆడి నిరసన వ్యక్తం చేశారు. గోరంట్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చెమ్మచెక్క ఆడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రిలేదీక్షలను కొనసాగించారు. లేపాక్షి తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో కోలాటం ఆడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించేవరకు నిరసనలు కొనసాగిస్తామన్నారు. చిలమత్తూరులో ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల నిరసనకు సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.



గోరంట్లలో అంగన్‌వాడీల వినూత్న ఆందోళన



లేపాక్షిలో కోలాటం ఆడుతూ నిరసన

కొనసాగిన పారిశుధ్య కార్మికుల సమ్మె



పెనుకొండలో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పెనుకొండ, జనవరి 1: సమస్యల పరిష్కారం కోరుతూ నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరింది. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కొనసాగించారు. అలాగే తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ మాజీ మంత్రి శంకర్‌నారాయణకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, బాబావలి, నగర పంచాయతీ కార్మిక నాయకులు చిన్న వెంకటేశ్, తిప్పన్న, రిక్షా నరసింహులు, ముత్యాలు, నరసింహులు, గంగాధర్, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కిండర్ గార్డెన్ డే

హిందూపురం, జనవరి 1: పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో కిండర్ గార్డెన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి యేడాది నూతన సంవత్సరం మొదటి రోజు పాఠశాలలో కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే సోమవారం వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షుడు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ కరోనా కారణంగా మూడేళ్లుగా వేడుకలు జరుపుకోలేకపోయామన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ యేడాది నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్మిత, నందిత, హెచ్‌ఎం గాయత్రి ఏట భాస్కర్, విజయేంద్ర, శశికళ తదితరులు పాల్గొన్నారు.



నింకంపల్లికి వెళ్లే రహదారిలో రోడ్డుపైనే చెత్తకుప్ప

పురం.. చెత్తమయం..

◆ పేరుకుపోయిన చెత్త

◆ దుర్గంధం వెదజల్లుతున్న వైనం

హిందూపురం, జనవరి 1 : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండటంతో పురం చెత్తమయంగా మారింది. కార్మికుల సమ్మెతో ఏడు రోజులుగా చెత్త సేకరణ, తరలింపు నిలిచిపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. పట్టణపరిధిలో 300మందికిపైగా కార్మికులు పారిశుధ్య నిర్వహణ చేపట్టేవారు. పట్టణంలోని ప్రధాన రహదారులతోపాటు వీధులను శుభ్రం చేయడం, ఇంటింటికి వెళ్లి చెత్తసేకరించి దానిని డంపింగ్ యార్డ్‌కు తరలించేవారు. కానీ ఏడు రోజులుగా కార్మికులు సమ్మెలో ఉన్నారు. శాశ్వత ఉద్యోగులు మినహాయించి మిగిలినవారంతా సమ్మెలోకి వెళ్లారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పాదయాత్రలో... కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి దిగిపోయే కాలం వచ్చినా సీఎం ఆ హామీ నెరవేర్చలేదు. అంతేకాదు యూజీడీ, మలేరియా, నీటి సరఫరా విభాగాల్లో కార్మికులకు హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలన్న డిమాండ్లను కూడా పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు గత నెల 26నుంచి సమ్మెబాట పట్టారు. అయినా ప్రభుత్వం స్పందించలేదు. దీంతో పురంలో ఎక్కడిచెత్త అక్కడే నిలిచిపోయింది. రోడ్డుపక్కన ఉన్న చెత్తకుండీలు నిండి రోడ్డుపైనే చెత్త ఉండటంతో అక్కడ పందులుస్వైర విహారం చేస్తున్నాయి. దీనివల్ల దుర్గంధం వెదజల్లుతోంది. ఎటువైపు చూసినా పట్టణంలో చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ఎప్పుడు ప్రభుత్వం స్పందిస్తుందో... కార్మికులు ఎప్పుడు విధుల్లోకి వస్తారో... అని ప్రజలు వాపోతున్నారు. అప్పటి వరకు ఇదే పరిస్థితిని భరించాలను వారు చర్చించుకుంటున్నారు.



ముక్కడిపేటలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త